నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్
5 | నిజామాబాద్, శనివారం 20 జనవరి 2024 | ADILABAD

పరీక్షా కేంద్రంలో నంబర్లు వేస్తున్న ఉపాధ్యాయులు

నేడే నవోదయ ప్రవేశ పరీక్ష

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 22 పరీక్షా కేంద్రాలు
- హాజరుకానున్న 4458 మంది విద్యార్థులు
- కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలు

నిర్మల్ అర్బన్, జనవరి 19: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి శనివారం నిర్వహించే పరీక్షకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల,కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల నుంచి 4458 మంది విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా నుంచి 983 మంది విద్యార్థులకు నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. నిర్మల్ జిల్లా నుంచి 1208 మంది దరఖాస్తు చేసుకోగా, 6 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నారు. మంచిర్యాల జిల్లా నుంచి 1188 మంది విద్యార్థులకు, ఏడు పరీక్షా కేంద్రాలు, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి 1079 మందికి ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా పరీక్ష కేంద్రాల్లో ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు.

నిర్మల్‌లో పరీక్షా కేంద్రాలు ఇవే..

నిర్మల్ జిల్లా వ్యాప్తంగా 1208 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్న నేపథ్యంలో వీరికి 6 కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలో, భైంసాలో మూడు చొప్పున సెంటర్లను కేటాయించారు. పట్టణ శివారులోని సెయింట్ థామస్ పాఠశాలలో 264, విజయ హైస్కూల్‌లో 217, వాసవి హైస్కూల్ 164, భైంసాలోని అల్ఫోర్స్ ఉన్నత పాఠశాలలో 240, వేదం హైస్కూల్‌లో 192, భైంసా వాసవి హైస్కూల్ 131 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఈ సందర్భంగా కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దీంతో పాటు కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు.

ఆదిలాబాద్ జిల్లాలో..

ఆదిలాబాద్ రూరల్, జనవరి 19: జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశానికి శనివారం నిర్వహించే ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ప్రణీత తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో లిటిల్ ఫ్లవర్ పాఠశాల, చావర అకాడమీ పాఠశాల, ఉట్నూర్‌లోని పూలాజీ బాబా స్కూల్, బోథ్‌లో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రక్తదానం శిబిరాన్ని ప్రారంభిస్తున్న రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవండి

ఎదులాపురం, జనవరి 19: ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలువాలని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ పిలుపునిచ్చారు. శ్రీరామ్‌సేన, తల్లి పిలుపు ఆధ్వర్యంలో శుక్రవారం రిమ్స్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రిమ్స్ సూపరింటెండెంట్ అశోక్, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ ఈ కార్యక్రమానికి హాజయ్యారు. వైద్యులు తిప్పస్వామి, రాహుల్ పుష్కర్, తెలంగాణ ప్రజా ఆరోగ్య వైద్య ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బండారి కృష్ణ, సిబ్బంది ఉన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాలు

జిల్లా వ్యాప్తంగా హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నామని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం రిమ్స్ దవాఖాన ఆవరణలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌తో కలిసి జెండా ఊపి కళాజాత బృందం అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ.. ఎయిడ్స్, కుష్టు వ్యాధుల నివారణపై పది రోజుల పాటు కళాజాత బృందం అవగాహన కల్పిస్తుందని తెలిపారు. రిమ్స్ దవాఖాన సూపరింటెండెంట్ అశోక్, జిల్లా కుష్టు(హెచ్ఐవీ,ఎయిడ్స్) నివారణ అధికారి డాక్టర్ గజానన్, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

మాట్లాడుతున్న నిర్మల్ జిల్లా కలెక్టర్ అశిష్ సంగ్వాన్

స్పెషల్ క్యాంపెయిన్ పకడ్బందీగా నిర్వహించాలి

ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్

నిర్మల్ టౌన్/ఆదిలాబాద్ రూరల్, జనవరి 19: ఈనెల 21, 22 తేదీల్లో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిర్వహించే స్పెషల్ క్యాంపెయిన్ డే కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లో పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారి వికాస్‌రాజ్ సూచించారు. హైదరాబాద్ నుంచి శుక్రవారం వీసీలో మాట్లాడారు. నిర్మల్ కలెక్టర్ కార్యాలయం నుంచి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్లు కిశోర్‌కుమార్, ఫైజన్ అహ్మద్ , ఆదిలాబాద్ నుంచి కలెక్టర్ రాహుల్ రాజ్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఓటరు జాబితాలో అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రచురించిన 18ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు కల్పించాలని సూచించారు. 20, 21వ తేదీల్లో ప్రతి పోలింగ్ బూత్‌లో ఓటరు నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించే విధంగా బీఎల్‌వోలను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణాధికారులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

నిర్మల్ టౌన్, జనవరి 19:ఈనెల 25న జరిగే జాతీయ ఓటర్ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. జిల్లాలో 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే ఉద్దేశ్యంతో ఈనెల 20, 21న స్పెషల్ ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తన్నామని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి ఓటు యొక్క ప్రాధాన్యతను వివరిస్తామని చయెప్పారు. అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్డీవో రత్నకల్యాణి పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం...

పార్లమెంట్ ఎన్నికల సమగ్ర ఓటర్ల జాబితాను సక్రమంగా తయారు చేసేందుకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం మార్పులు, చేర్పుల కోసం ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని దీనికి రాజకీయ పార్టీల నేతలు సహకరించాలని కోరారు. నాయకులు రమేశ్, మజీద్, హైదర్, రవి పాల్గొన్నారు.

మళ్లీ మార్పెందుకో..!?

మరోసారి వివాదంలోకి ఎన్‌హెచ్- 63

- తాజాగా మూడో అలైన్‌మెంట్ తయారు చేసిన ఎన్‌హెచ్ఏఐ
- ముల్కల్ల-రాయపట్నం దాకా గోదావరి తీరం వెంట రోడ్డు
- వారం, పది రోజుల్లో నోటిఫికేషన్ వచ్చే ఛాన్స్...!
- బడాబాబులు, రియల్ వ్యాపారుల కోసమే ముల్కల్ల-కుర్మపల్లి రూట్ మారుస్తున్నారని స్థానికుల మండిపాటు

ముల్కల్ల నుంచి లక్షెట్టిపేట(గూడెం)కు వెళ్లే ప్రస్తుత జాతీయ రహదారి-63

మంచిర్యాల, జనవరి 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నుంచి మంచిర్యాల జిల్లా కుర్మపల్లి వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి ఎన్‌హెచ్-63 అలైన్‌మెంట్ మరోసారి కొత్త మలుపు తిరిగింది. ఎన్‌హెచ్ఏఐ తాజాగా మూడో అలైన్‌మెంట్ తయారు చేయడం స్థానికంగా పెద్ద చర్చనీయాంశంగా మారింది. మొదట దండేపల్లి మండలం గూడెం నుంచి ముల్కల్ల వరకు పొలాల మీదుగా గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం కోసం సర్వే చేశారు. దీంతో విలువైన వ్యవసాయ భూములు పోతున్నాయంటూ రైతులు ఆందోళన చేయడం, దాని బడ్జెట్ సైతం అధికమవుతుందనే ఉద్దేశంతో దాన్ని విరమించుకున్నారు. ఇక రెండోసారి ప్రస్తుతం ఉన్న హైవేను నాలుగులేన్‌లుగా విస్తరించడానికి సర్వే చేశారు. అలాగైతే ముల్కల నుంచి లక్షెట్టిపేట అవతలి వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇండ్లన్నీ పోతాయని ఊర్లకు ఊర్లు నిరసనలు, ధర్నాలకు దిగాయి. ఈ ప్రతిపాదన మార్చి, ముందున్న అలైన్‌మెంట్ ప్రకారమే చేయాలనే డిమాండ్ వచ్చింది. దీంతో తాజాగా అధికారులు మూడో అలైన్‌మెంట్ తయారు చేసి ఢిల్లీకి పంపించారు. ఇందుకు సంబంధించి సర్వే సైతం పూర్తి చేశారు. వారం, పది రోజుల్లో ఎన్‌హెచ్ ఏఐ నోటిఫికేషన్ రాగానే టెండర్లు పిలిచి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

అటు సరే.. ఇటెందుకు మార్చినట్లు..

ముల్కల నుంచి గూడెం వరకు పొలాలు, ఇండ్లు పోకుండా గోదావరి తీరం వెంట రోడ్డు వేసేలా మూడో అలైన్‌మెంట్ ప్రతిపాదనలు సిద్ధం చేశారు. నదీ తీరం నుంచి 500 మీటర్ల దూరంలో బైపాస్ వెళ్లేలా ఇది ఉంటుందని చెబుతున్నారు. ఇలా చేసినా కొన్ని వ్యవసాయ భూములు పోయే ప్రమాదం ఉంది. కానీ పెద్దగా ఇబ్బందులు లేకపోవచ్చని భావిస్తున్నారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా ముల్కల్ల నుంచి కుర్మపల్లి మధ్యలో పాత అలైన్‌మెంట్‌ను మార్చడంపై స్థానికులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. సర్వే చేస్తున్న సమయంలోనూ అధికారులను అడ్డుకొని ఆందోళనకు దిగినా పట్టించుకోలేదని వాపోతున్నారు. ముందు నుంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉన్న అలైన్‌మెంట్‌ను ఇప్పుడు మార్చడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. పాత అలైన్‌మెంట్ ప్రకారమైతే కొందరు బడా వ్యక్తులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూములు కోల్పోతున్నారని వారికి మేలు చేసేందుకు ఇలా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. బడాబాబులకు మేలు చేసేందుకు సామాన్యుల భూముల నుంచి హైవేను తీసుకుపోతున్నారంటూ మండిపడుతున్నారు. మొదటి అలైన్‌మెంట్ ప్రకారం ముల్కల్ల వాగు పక్క నుంచి రోడ్డు నిర్మించాల్సి ఉంటుంది. అలా చేస్తే కొందరు బడా వ్యక్తుల భూములు పోతున్నాయని, ఉద్దేశపూర్వకంగానే ఈ అలైన్‌మెంట్‌లో దాన్ని మార్చినట్లు స్థానికులు చెబుతున్నారు. మొదటి అలైన్‌మెంట్‌ను అనుసరించే హైవే నిర్మించాలని రెండు రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

కుర్మపల్లి మీదుగా వచ్చి ముల్కల్లలోని ఎన్‌హెచ్-63లో కలిసే ప్రదేశం

ఈ సారైనా ముందుకు సాగేనా..

ఎన్‌హెచ్-63 నిజామాబాద్ జిల్లా బోధన్ నుంచి ఛత్తీస్‌గఢ్‌లోని జగ్దల్‌పూర్ వరకు విస్తరించి ఉంది. ఆర్మూర్ నుంచి మంచిర్యాల వరకు 160 కిలోమీటర్ల మేర రూ.2500 కోట్ల అంచనా వ్యయంతో గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీనికోసం నాలుగేండ్ల క్రితమే అధికారులు సర్వే చేసి అలైన్‌మెంట్ రూపొందించారు. రైతుల ఆందోళనతో అది మారిగా, ఏడాది క్రితం తయారు చేసిన రెండో అలైన్‌మెంట్ వివిధ గ్రామాల ప్రజల నిరసనలతో మార్చాల్సి వచ్చింది. తాజాగా రూపొందించిన మూడో అలైన్‌మెంట్‌లో ముల్లల్క నుంచి కుర్మపల్లి వరకు వివాదాస్పదం కావడంతో స్థానికంగా వ్యతిరేకత మొదలైంది. ఈసారి కూడా స్థానికులు అడ్డుకుంటే ఈ భారీ హైవే నిర్మాణం పూర్తి చేయడం సాధ్యమవుతుందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మూడో అలైన్‌మెంట్ తయారీ విషయమై ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ అజయ్ మణికుమార్‌ను వివరణ కోరగా... ఇండ్లు పోతున్నాయని స్థానికుల నిరసనలు, ప్రజా ప్రతినిధుల వినతులను పరిగణలోకి తీసుకొని మూడో అలైన్‌మెంట్ రూపొందించామన్నారు. హైవే ఎక్కడ వచ్చినా భూములు కోల్పోవాల్సి వస్తుందన్నారు. భూములు పోకుండా రోడ్డు వేయడం సాధ్యం కాదన్నారు. ప్రజలు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని హైవే నిర్మాణానికి పూర్తిగా సహకరించాలని ఆయన కోరారు.

బాతుల పెంపకం భలే బాగు

- కోళ్ల పెంపకం కంటే లాభదాయకం
- తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి జిల్లాకు రాక
- యాసంగి సీజన్‌లో మేత కోసం వలస
- వీటి గుడ్లతోనే ప్రధాన ఆదాయం
- గుడ్లు కేరళ రాష్ట్రానికి తరలింపు
- నెలకు రూ.లక్షకుపైగా సంపాదన

ఖానాపూర్ శివారులో వ్యవసాయ క్షేత్రాల్లో బాతులకు ఆహారం మేపుతున్న పెంపకందారుడు

ఖానాపూర్ రూరల్, జనవరి 19 : గొర్రెలు, కోళ్ల పెంపకం తర్వాత బాతుల పెంపకానికి అధిక ప్రాధాన్యత లభిస్తున్నది. సాధారణంగా ఈస్ట్రన్, సదరన్ రాష్ట్రాల్లోని సముద్ర తీర ప్రాంతాల్లో బాతులను అధికంగా పెంచుతారు. తెలంగాణలో యాసంగి సీజన్‌లో దుక్కులు, నారుమడులు సిద్ధం చేయడానికి నెల రోజుల ముందు తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి పెంపకందారులు బాతులను డీసీఎం వ్యానుల్లో తీసుకుని వస్తారు. ప్రస్తుత సీజన్‌లో దాదాపు 20 మంది 10 వేల బాతులను తీసుకొచ్చారు. ఇక్కడే గ్రామాల్లోని శివారు ప్రాంతాల్లో డేరాలు వేసుకొని ఉంటారు. పగలు బాతులను పొలాల్లోకి మేత కోసం తీసుకెళ్తారు. 2 వేల బాతుల చొప్పున బృందాలుగా విడిపోయి మేతకు తీసుకెళ్తారు. ఇవీ ఒక్క రోజులో మేత కోసం దాదాపు 10-20 కిలోమీటర్లు ప్రయాణిస్తాయి. నీరు ఉంటే అధిక దూరం వెళ్తాయి. లేకపోతే అర కిలోమీటర్ దూరం కూడా వెళ్లలేవు. వ్యవసాయ పొలాల్లో తిరుగుతూ క్రిమి కీటకాలు, ధాన్యపు గింజలు, పచ్చి గడ్డిని మేస్తాయి.

బాతుల పెంపకం లాభదాయకం

ఖానాపూర్ మండలానికి 1,500 బాతులను తీసుకొచ్చినట్లు పెంపకందారులు తెలిపారు. ఒక్కో బాతు ఒక్క రోజు ఒక గుడ్డు పెడుతూ యేడాదికి సగటున 300ల గుడ్లను పెడుతాయన్నారు. ఒక్కో గుడ్డు ధర మార్కెట్‌లో రూ.7లకు విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం.. 1,500 బాతుల్లో 500 బాతులు 500 గుడ్లు పెడుతున్నాయని పేర్కొన్నారు. వీటిని మూడు రోజులకోసారి కేరళ రాష్ట్రానికి ఎగుమతి చేస్తున్నట్లు తెలిపారు. వీటి ద్వారా నెలకు రూ.1.05 లక్షల వరకు ఆదాయం పొందుతున్నామంటున్నారు. కోళ్ల కంటే అధికంగా గుడ్లు పెడుతాయని, గుడ్ల పరిమాణం పెద్దగా ఉంటాయని అంటున్నారు. ఈ బాతుల పెంపకంలో శ్రద్ధ అవసరం లేదు. వ్యాధులు భారిన పడడం తక్కువ. మిగిలిన ఫౌల్ట్రీ జాతుల కన్నా తెలివైనవి. నీళ్లు అధికంగా ఉన్న ప్రదేశంలో పెంచవచ్చు. మాంసోత్పత్తి కోళ్ల తరువాత ప్రముఖ స్థానంలో ఉంటాయి.

ఒక్కరోజులో పెట్టిన బాతు గ్రుడ్లు

రాత్రి సమయంలో సేద తీరుతున్న బాతులు

జీవనోపాధి పొందుతున్నాం..

నేను 22 ఏండ్లుగా బాతులను పెంచుతూ జీవనోపాధి పొందుతున్నా. ఇవీ పుట్టిన ఐదు నెలల నుంచే గుడ్లను పెడతాయి. గుడ్లు పెట్టే బాతులను విక్రయించి పెంపకాన్ని ప్రారంభిస్తాం. బాతు జతకి ధర రూ.230, ట్రాన్స్ పోర్ట్‌కి రూ.320లతో కలిసి రూ.550లకు కొనుగోలు చేసి పెంపకం చేస్తాం. వాటిని మూడేండ్లు పెంచుతూ గుడ్లు, మాంసాన్ని ఉత్పత్తి చేస్తాం. ఇలా రాష్ట్రాలు తిరుగుతూ జీవనోపాధి పొందుతున్నాం.

- రాజేశ్, బాతుల పెంపకందారు, తమిళనాడు

సైక్లింగ్ క్లబ్ సభ్యులు

50 రోజుల రన్నింగ్ చాలెంజ్ పూర్తి

నిర్మల్ సైక్లింగ్ క్లబ్ ఆధ్వర్యంలో విజయవంతం

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 19: ఆరోగ్యం, నడక, పరుగుపై అవగాహన కల్పించడానికి నిర్మల్ సైక్లింగ్ క్లబ్ గతేడాది డిసెంబర్ 1న 50 రోజుల రన్నింగ్ చాలెంజ్‌ను విసిరింది. ఈ చాలెంజ్‌కు శుక్రవారంతో 50 రోజులు పూర్తయ్యాయి. కాగా, 21 మంది సభ్యులు పేరు నమోదు చేసుకొని విజయవంతంగా ఈ చాలెంజ్‌ను పూర్తి చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పిన్స్ స్విమ్మింగ్‌లో భారత దేశం తరపున గోల్డ్ మెడల్, సిల్వర్ మెడల్ సాధించిన క్వీన్ విక్టోరియా హైదరాబాద్ నుంచి వచ్చారు. ఫిట్నెస్ కోచ్ ఫణిరాజు వచ్చారు. రన్నింగ్‌లో పాల్గొన్న సభ్యులను మెడల్స్‌తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ రాకేశ్ రెడ్డి, డా. రామచంద్రా రెడ్డి, శరత్‌రెడ్డి, డా. నర్సింహారెడ్డి, డా. రఘునందన్‌రెడ్డి, సబ్ రిజిస్ట్రార్ శ్రీరామరాజు, డా. శ్రీకాంత్, డా. కృష్ణస్వామి, సీఏ సాయి ప్రసాద్, అసోసియేషన్ సభ్యులు, డిగ్రీ కాలేజీస్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా

నిర్మల్ టౌన్, జనవరి 19: మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం రూ. 3వేల వేతనం చెల్లిస్తామని హామీనిచ్చినా అది అమలుకాకపోగా, పెండింగ్ బిల్లులు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రం కలెక్టరేట్‌లో ఏవోకు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేశ్, పోసాని, లక్ష్మి, తదితరులున్నారు.

మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగాలి

- తెలంగాణ గ్రామీణ బ్యాంక్ చైర్‌పర్సన్ శోభ
- ఉట్నూర్, ఇంద్రవెల్లిలో పర్యటన

ఉట్నూర్ రూరల్, జనవరి 19: మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు చైర్‌పర్సన్ శోభ అన్నారు. మండలంలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు ద్వారా రూ. 2 కోట్ల చెక్కును రీజినల్ మేనేజర్ వెంకటరామిరెడ్డితో కలిసి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సంఘాలు బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలు వ్యాపారాలు చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. రుణాలు వాయిదాల పద్ధతిలో తిరిగి బ్యాంకుకు ప్రతి నెల ఐదో తేదీలోపు చెల్లిస్తే పావలా వడ్డీ వర్తిస్తుందని తెలిపారు. ప్రైవేట్ బ్యాంకుల వద్ద రుణాలు తీసుకొని అధిక వడ్డీలు కడుతూ మోసపోకూడదని మహిళా సంఘాలకు సూచించారు. మహిళలకు ముద్ర రుణాల పంపిణీలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ప్రథమ స్థానంలో ఉందని తెలిపారు. మహిళా సాధికారిత కోసం నిరంతరం కృషి చేస్తున్న ఉట్నూర్ గ్రామీణ బ్యాంకు సిబ్బంది, ఐకేపీ సిబ్బందిని అభినందించారు. బ్యాంక్ మేనేజర్ మధుసూదన్ రెడ్డి, బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ అజయ్ కుమార్, సిబ్బంది, ఐకేపీ ఏపీఎం, సీసీలు, మహిళలు పాల్గొన్నారు.

బ్యాంకును సద్వినియోగం చేసుకోవాలి

ఇంద్రవెల్లి, జనవరి 19: తెలంగాణ గ్రామీణ బ్యాంకు సేవలను ప్రజలు, ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు రాష్ట్ర చైర్‌పర్సన్ వై శోభ కోరారు. ఇంద్రవెల్లి మండల కేంద్రంలో కొత్త భవనంలో ఏర్పాటు చేసిన బ్యాంకు శాఖను ఆమె శుక్రవారం ప్రారంభించారు. ముందుగా బ్యాంకు అధికారులు ఆమెకు పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాతో సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని ప్రజలకు మరిన్ని సేవలు అందించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. బ్యాంకు ద్వారా అందిస్తున్న వివిధ రకాల సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలంలోని ముత్నూర్ గ్రామంలో కూడా త్వరలోనే బ్యాంకు శాఖను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఆదిలాబాద్ ఆర్ఎం వెంకటేశ్‌రాంరెడ్డి, ఇంద్రవెల్లి బ్రాంచ్ మేనేజర్ జాడి క్రిష్ణ, మాజీ మేనేజర్ ఆడే రామేశ్వర్, ఐకేపీ ఏపీఎం రాథోడ్ రామారావ్, భవన యాజమాని బాబుముండే, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు చెక్కుని అందజేస్తున్న తెలంగాణ గ్రామీణ బ్యాంకు చైర్‌పర్సన్ శోభ

హ్యుందాయ్ కొత్త క్రెటా ఆవిష్కరణ

హ్యుందాయ్ కొత్త క్రెటా కారును విడుదల చేస్తున్న అజయ్‌కుమార్‌రెడ్డి

సోన్, జనవరి 19: నిర్మల్ మండలంలోని ఎల్లపెల్లి శివారులో ఉన్న ప్రకాశ్ హ్యుందాయ్ షోరూంలో హ్యుందాయ్ క్రెటా కొత్త కారు-2024ను జిల్లా ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ అజయ్‌కుమార్‌రెడ్డి, షోరూం సీఈవో నల్ల ప్రతిహాస్‌రెడ్డితో కలిసి శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎందరో కష్టమర్ల మన్ననలు పొందిన క్రెటా కారును సరికొత్తగా అత్యాధునిక టెక్నాలజీని పొందుపరుస్తూ కష్టమర్ల అభిరుచులకు తగట్టుగా తీసుకురావడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ డైనమిక్ ఎస్‌యూవీ క్వాడ్‌బీమ్ లెడ్ హెడ్‌ల్యాంప్‌లు, హ్యుందాయ్ స్మార్ట్‌సెన్స్ లెవల్ 2 ఏడీఏఎస్ వంటి ఫీచర్లను కలిగి ఉన్నదని చెప్పారు. సెన్సుయస్ స్పోర్టీనెస్ డిజైన్ లాంగ్వేజ్‌ను కలిగి ఉందని పేర్కొన్నారు. షోరూం మేనేజర్ యశ్వంత్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.